



# పీజీ మెడిసిన్‌కు చైనా ఆహ్వానం!

**ఇంగ్లిష్ మీడియంలో తక్కువ ఖర్చుకే ఎంబీబీఎస్‌ను అందిస్తూ ప్రాచుర్యం పొందిన చైనా- ఇప్పుడు పీజీ కోర్సుల విషయంలోనూ ముందు నిలుస్తోంది. విభిన్న స్పెషలైజేషన్లతో మనదేశ విద్యార్థులకు ఆహ్వానం పలుకుతోంది.**

మిగతా రంగాల్లోలాగే వైద్యవిద్యలో కూడా స్పెషలైజేషన్లకు ప్రాముఖ్యం పెరిగింది. అందుకే ఎంతోమంది ఎంబీబీఎస్‌తోనే ఆగిపోకుండా పీజీ కోర్సులు చదవటానికి మొగ్గు చూపిస్తున్నారు. అయితే మన రాష్ట్రంలో పీజీ సీట్లు పరిమితం. ఫీజుల భారమూ ఎక్కువే. రేడియాలజీ లాంటి కొన్ని స్పెషలైజేషన్లకయితే కోటి రూపాయల దాకా. ఖర్చు అవుతోంది. దీంతో ఫీజులు అందుబాటులో ఉండే రష్యాలాంటి దేశాలకు వెళ్ళి పీజీ కోర్సులు చేయటం మామూలయింది.

ఈ విషయంలో ఇప్పుడు చైనా ఆకర్షణీయమైన ప్రత్యామ్నాయంగా మారుతోంది. తక్కువ వ్యయంతోనే పీజీ చదవగలిగే వీలూ, ఉన్నత విద్యా ప్రమాణాలూ దీనికి ముఖ్య కారణాలు. అత్యాధునిక పరికరాలూ, ప్రయోగశాలల సదుపాయాలతో ఇక్కడి వైద్య కళాశాలలు తమ ప్రత్యేకత ప్రదర్శిస్తున్నాయి.

## రూ.10 లక్షల్లోపే ఖర్చు

బీజింగ్‌కు సమీపంలోని *Dalian University (Liaoning province), Wuhan University (Hubei province)* ల్లో రూ. 9- 10 లక్షల ఖర్చుకే పీజీ చేసే సదుపాయముంది. షాంఘై సెకండ్ మెడికల్ యూనివర్శిటీ, బీజింగ్‌లోని పెకింగ్ యూనివర్శిటీల్లో మాత్రం రూ. 12- 15 లక్షల ఖర్చవుతుంది.

కమ్యూనిస్టు చైనాలో ప్రైవేటు ఆస్పత్రులనూ, డయాగ్నస్టిక్ కేంద్రాలనూ ప్రోత్సహించరు. దీంతో రోగులు ప్రభుత్వ ఆస్పత్రులకే వెళ్తుంటారు. ఈ ఆస్పత్రులు చైనీస్ వైద్య విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా పనిచేస్తుంటాయి.

ఈ రకంగా ఇక్కడికి పెద్ద సంఖ్యలో వచ్చే రోగులు పీజీ విద్యార్థుల అధ్యయనానికి పరోక్షంగా ఉపయోగపడుతున్నారు. ఉదాహరణకు డలియాన్ మెడికల్ యూనివర్శిటీకి రోజుకు వచ్చే రోగుల సంఖ్య ఐదువేలు. ఇక్కడున్న 35 స్పెషలైజేషన్లలో సర్జికల్ కాస్మటాలజీ, న్యూరో సైకియాట్రీ లాంటి అరుదైన విభాగాలు యు.ఎస్., కెనడా, ఇతర పాశ్చాత్యదేశాల విద్యార్థులను కూడా ఆకర్షిస్తున్నాయి.

పీజీ స్పెషలైజేషన్లను చైనాలో ఇంగ్లిష్ మీడియంలో అందిస్తున్నారు. తొలి దశలోని మూడు నెలల *language orientation* , చివర్లోని థీసిస్ కూడా కలిపి కోర్సుల కాల వ్యవధి మూడు సంవత్సరాలు.